క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

తలమడుగు: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వహించినట్లు ఎంపీడీవో శేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం 11 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

రిమ్స్‌లో కొత్త ఏజెన్సీలకు అవకాశం ఇవ్వాలి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఔట్‌సోరి్సంగ్ ఏజెన్సీల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కృష్ణ కన్‌స్ట్రక్షన్, మహాలక్ష్మి మ్యాన్ పవర్ సొసైటీలు మాత్రమే కొనసాగుతున్నాయన్నారు. ఉద్యోగాల కోసం వచ్చే వారి నుంచి రూ.లక్ష నుంచి 3 లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి పత్రిక ప్రకటన ద్వారా నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

లేగదూడకు చికిత్స

బజార్‌హత్నూర్: మండలంలోని ఇచ్చోడ, సోనాల అంతరాష్ట్ర రాహదారిలో కడెం నది వంతెనపై నుంచి లేగదూడ రాళ్లల్లో పడిపోయింది. గమనించిన రైతులు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ పశువైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య చికిత్స అందించారు. లేగదూడ ఎవరిదో తీసుకెళ్లాలని సూచించాడు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ గురువారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్యపడొద్దన్నారు.

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత



ప్రవచనాలు బోధిస్తున్న ప్రణవానంద ప్రభువు

తాంసి: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత ప్రణవానంద ప్రభువులు అన్నారు. బుధవారం రాత్రి కప్పర్ల గ్రామంలోని రామాలయంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ప్రవచనాలు బోధించారు. ఆధ్యాత్మికంతో కలిగే లాభాలు, ఏకాగ్రత సైతం పెరుగుతుందని వివరించారు. ప్రతిఒక్కరూ తమ జీవితంలో భక్తిని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగన్న, సంతోష్, సదానంద్, నారాయణ, మహేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రాయితీ ఇవ్వాలని డీఈవోకు వినతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలని జర్నలిస్టు జేఏసీ ప్రతినిధులు కోరారు. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీతను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు డీఈవో సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ చైర్మన్ నూకల దేవేందర్, కోకన్వీనర్ వెంకటేశ్, ఏరే సుధాకర్, సురేశ్, దేవిదాస్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్ల తొలగింపు



రాళ్లు తొలగిస్తున్న ఎంపీవో మహేశ్‌కుమార్

బేల: మండలంలోని సాంగ్వి(కె) శివారులో అక్రమంగా వేసిన లేఅవుట్‌లో హద్దురాళ్లను గురువారం మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్ తొలగించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా లేఅవుట్‌లు వేయడం చట్ట రీత్యా నేరమన్నారు. దీనిపై సంబంధిత యాజమానికి నోటీసులు ఇచ్చి, లేఅవుట్ కోసం వేసిన బండరాళ్లను తొలగించామన్నారు. మండలంలో ఎక్కడైనా లేఅవుట్‌లు వేస్తే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లేఅవుట్‌ల కోసం జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేశ్, దేవన్న, అకాష్, వినోద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నాయ్..

● మండలంలోని లింగుగూడ పంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్‌కు విద్యుత్ మరమ్మతుపై కొంత అవగాహన ఉంది. గత నెల 17న ధర్‌లొద్దీ గ్రామంలో స్తంభం ఎక్కి వీధి దీపాలు అమరుస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయింది. వెంటనే స్తంభం పై నుంచి కిందపడ్డాడు. స్థానికులు అతన్ని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

● యాపల్‌గూడ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన మోతీరాం ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నాడు. పంచాయతీ పరిధిలో ఏదైనా విద్యుత్ సరఫరాలో సమస్య వస్తే ఆయనే మరమ్మతు చేసేవాడు. ఈ క్రమంలో ఆదివారం యాపల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తింది. మోతీరామ్‌కు తెలియడంతో స్తంభం ఎక్కాడు. పైన ఉన్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలి స్తంభంపైనే మృతి చెందాడు.

● గతవారం, పది రోజుల కిందట బూర్నుర్ గ్రామానికి చెందిన పలువురు రైతుల పొలాల్లోని బోరుబావులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. అదే గ్రామానికి చెందిన ఓ రైతుకు విద్యుత్ మరమ్మతులో కొంత అనుభవం ఉంది. విద్యుత్ అధికారులను అడిగి లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అడిగారు. ప్రస్తుతం సరఫరా లేదని మరమ్మతు చేసుకోవచ్చని చెప్పాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేస్తుండగా కరెంట్ సరఫరా అయింది. ఎలాంటి ప్రాణహాని జరగలేదు కానీ గాయాలతో బయటపడ్డారు. మండలంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

● ఎల్‌సీ తీసుకోకుండానే స్తంభాలెక్కుతున్న ఎలక్ట్రీషియన్లు
● కరెంట్ షాక్‌తో మృత్యువాత
● గాయాలతో బయటపడుతున్న కొందరు



యాపల్‌గూడలో స్తంభంపై మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషన్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: వేసవి, వర్షాకాలాల్లో ఈదురు గాలులు, వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని సంబంధిత మండల విద్యుత్ అధికారి, జూనియర్ లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్ల దృష్టికి తీసుకెళ్లాలి. కానీ కొన్ని గ్రామాలకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషయన్లు వారికి విద్యుత్ మరమ్మతులో అనుభవం ఉండడంతో వారే స్తంభాలు ఎక్కుతున్నారు. అధికారుల నుంచి ఎలాంటి ఎల్‌సీ తీసుకోకుండా ఆకస్మాత్తుగా సరఫరా కావడంతో స్తంభాలపైనే మృత్యువాతపడుతున్నారు. మరికొందు గాయాలతో బయటపడుతున్నారు.

పెద్దదిక్కు కోల్పోతున్న కుటుంబాలు

సంబంధిత అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకోకుండా ప్రైవేట్ ఎలక్ట్రిషయన్లు స్తంభాలపై ఎక్కుతున్నారు. ఆకస్మాత్తుగా సరఫరా జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో వారిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతున్నారు.

స్తంభాలు ఎక్కవద్దు



విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే తమకు సమాచారం అందించాలి. తమకు సమాచారం ఇవ్వకుండా ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు స్తంభాలు ఎక్కి మరమ్మతు చేస్తున్నారు. ఆకస్మాత్తుగా సరఫరా జరిగిన సందర్భాల్లో విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. సమాచారం ఇవ్వకుండా స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేయడం చట్టారీత్య నేరం.

– తిరుపతిరెడ్డి, మండల విద్యుత్ శాఖ అధికారి

తూములకు మరమ్మతులు కరువు



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కజ్జర్ల రైతులు (ఫైల్)

● ధ్వంసమైన చెరువు తూములు
● పట్టించుకోని సంబంధిత అధికారులు
● ఆందోళనలో రైతులు

తలమడుగు: మండలంలోని కొత్తూరు, కజ్జర్ల, గ్రామాల్లో సాగునీరు అందించే పెద్ద చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కాలువలు, తూములకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథా అవుతోంది. కజ్జర్ల, కోత్తూర్, చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. వర్షం నీరు చెరువులోకి వచ్చి చేరితే మరమ్మతులు చేయడం వీలు కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురువకపోవడంతో కాలువ, తూము పనులు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించబడిన చెరువులకు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాపు నీరు నిల్వకుండా పోతుంది. గతంలో కోత్తూర్ చెరువుకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి గాలికి వదిలేశారు. ఎక్కడ లీకేజీ ఉందో గుర్తించకుండానే పనులు చేపట్టారు. ప్రస్తుతం తూముల ద్వారా చిన్నచిన్న రంధ్రాలు ద్వారా నీరు బయటకు వెళ్తుంది. ఈ విషయం అధికారులు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌కు కజ్జర్ల గ్రామస్తులు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు, తూములకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతాం

మండలంలోని కజ్జర్ల, గ్రామ చెరువులకు తూము సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. కోత్తుర్ చెరువు సమస్య నా దృష్టికి రాలేదు. సిబ్బందిని వెళ్లి పరిశీలించి రావడం జరిగింది. త్వరలోనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. నీరు వృథా కాకుండా చూస్తాం.

– శ్రీనివాస్, జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని సవర్గాం గ్రామంలో మిషన్ భగీరథ సర్వేలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. ప్రతిఒక్కరికీ మిషన్ భగీరథ నీరు అందుతుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్చాలి



వినతిపత్రం అందజేస్తున్న సర్కిల్ నరేశ్

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ చిహ్నం మార్చి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల భవనం, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క, సారలమ్మ చిత్రాలతో కూడిన చిహ్నం ఏర్పాటు చేయాలని ధర్మసమాజ్ మండల అధ్యక్షుడు సర్కిల్ నరేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంగయ్య, తరుణ్, సురేశ్, రమేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాలకేంద్రం చిన్నారులకు సన్మానం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులను బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులను శాలువాలతో సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి, తల్లిదండ్రుల సంఘం సభ్యులు సృజన, శ్రావణ్, పరశురాం పాల్గొన్నారు.

వ్యాధులు కాలం.. అప్రమత్తతే ముఖ్యం



బోథ్‌లో రోడ్డు పక్కన ఉన్న కాలువలో నిల్వ ఉన్న నీరు

● ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
● గ్రామాల్లో అవగాహన కల్పించాలి

బోథ్: సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున జూన్ నుంచి ఐదు నెలల పాటు చాలా కీలకమని వైద్యులు చెబుతున్నారు. వానాకాలంలో వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత వచ్చే చలికాలంలో మరింత అప్రమత్తత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వైద్య, పురపాలక, పంచాయతీ శాఖల సమన్వయంతో వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లోకి, పట్టణాల్లోకి వెళ్లి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ఇప్పటి నుండే అధికారులు సంసిద్ధం కావాలి. జిల్లాలో ప్రతీఏటా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ కారణంగా రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలు కుట్టిన వెంట జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి. రక్త ఫలకికలు తగ్గి ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. సాధారణ ఫ్లూతో పట్ల ప్రజలు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారిపై ఫ్లూ వెంటనే దాడి చేస్తుంది. జలుబు, దగ్గు, ఆయాసం, శక్తిని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

స్వైన్ ఫ్లూతో జాగ్రత్త..

అక్టోబరు నుంచి మార్చి వరకు స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతుంటాయి. వైరస్ శ్వాస కోశ వ్యవస్థపై దాడి చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతుంది. స్వైన్ ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. లక్షణాలు ఉంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు..

● నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. దోమల లార్వాను నియంత్రించాలి.
● మురుగు కాల్వ పూడిక, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
● కాల్వల్లో మందుల పిచికారీ చేపట్టాలి.
● ప్రధాన ప్రాంతాల్లో, అంతర్గత కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
● వార్డుల వారీగా పారిశుద్ధ్య చర్యలపై వివరాలను కార్యాలయాల్లో నమోదు చేయాలి.
● వ్యాధులు ప్రబలే మురుగువాడల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలి.
● ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలున్న వారు వెంటనే వైద్యం చేయించుకోవాలి. ప్రస్తుతం ఏ చిన్న లక్షణాలు కనిపించినా అప్రమత్తం కావాలి. ఎవరికి వారు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే ఉత్తమం. ఏదైనా లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలి.

– రాజనాల రవీంద్రప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, బోథ్

‘పోడు రైతులను ఇబ్బంది పెట్టవద్దు’



అటవీ అధికారులతో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: గత కొన్నేళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులను అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామపంచాయతీ పరిధిలో గల సిరికొండ గ్రామ శివారులో పోడు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పోడు వ్యవసాయ భూములను పరిశీలించారు. రైతులతో, అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. ఆదివాసీల భూముల్లో మొక్కలు నాటేందుకు జేసీబీలతో తవ్వుతున్న గుంతలను ఆపాలని సూచించారు. ఇప్పుడు మొక్కలు నాటితే వారి బతుకులు ఏం కావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించడంతో అధికారులు జేసీబీలను తిరిగి పంపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని, ప్రజలకు అనుకూలంగా అధికారులు, నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్ రావు, కోరెడ్డి కిషన్, సుధాకర్ గౌడ్, మల్లన్న, సోమన్న, గంగారం, బాపురావ్, జాకూ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్

ఇంద్రవెల్లి: మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ఇంటింటా నల్లా కనెక్షన్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో జరుగుతున్న సర్వేను పర్యవేక్షించి యాప్‌లోనూ వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా 32 గ్రామపంచాయతీలలో ఇంటింటా మిషన్ భగీరథ సర్వే కొనసాగుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సిబ్బంది ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసర్వే ద్వారా మిషన్ భగీరథ నీరు ఎంత మందికి వస్తుంది ఎంత మందికి రావడం లేదో? తెలుస్తుందన్నారు. ఇంటికీ వచ్చిన సర్వే సిబ్బందికి వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

ఎంపీ నగేశ్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఆదిలాబాద్: ఎంపీగా గోడం నగేశ్ ఎన్నికవడంతో పలు సంఘాల నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు, పర్ధాన్ సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, రఘురాం, పర్ధాన్ సంఘం నాయకులు మాధవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.



బోథ్: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బోథ్: బోథ్ మండలానికి చెందిన నాయకులు ఆదిలాబాద్‌లోని ఎంపీ ఆయన నివాసంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జక్కుల వెంకటేశ్, చిటికేసి వెంకటేశ్, నల్ల గంగయ్య, నరసింహాదాస్, పూంద్రు రాకేశ్‌రెడ్డి, సాయి రోహిత్, శైలేందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను గురువారం ఇచ్చోడ బీజేపీ నాయకులు మర్యదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎంపీగా గెలుపొంది ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారానికి వెళ్లి ఢిల్లీ నుంచి ఆదిలాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు సురేందర్‌రెడ్డి, అంబేకర్ పాండు, తృప్తి గంగాధర్, పెందుర్ తుల్సీరాం, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామ బీజేపీ నాయకులు ఆదిలాబాద్‌లోని గోడం నగేశ్‌ను గురువరాం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాతజీ కిరణ్, శానం శ్రీనివాస్, ఆడెపు శ్రీను, పూలవేణి గణేష్, చింతల రాజు, రేగుల మోహన్, పోరండ్ల రాములు, నగేశ్, అశోక్, రాహుల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేశ్ ఎన్నికై మొదటిసారిగా ఆదిలాబాద్‌కు రావడంతో వారి నివాసంలో గురువారం మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రతిఒక్క కార్యకర్తకు గుర్తింపు ఇస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, తిత్రే నారాయణ సింగ్, జాదవ్ పరశురాం, చొక్కపెల్లి రాములు, తీగల నవీన్ కుమార్, గాదె శంకర్, కొప్పుల గంగారెడ్డి, సరసాని మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



ఇచ్చోడ: గోడం నగేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు



నేరడిగొండ: పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామస్తులు

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



డి. చిన్నయ్య

జైనథ్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి డి. చిన్నయ్య ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉన్న అతను గతేడాది ఏప్రిల్‌లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యారు.కాగా గురువారం విడుదలైన ఫలితాల్లో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గజేందర్ తెలిపారు. ఇంటర్ వరకు ప్రతీ సంవత్సరం సంవత్సరానికి రూ. 12వేల స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి చిన్నయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.